క్లుప్తంగా

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, అక్షింతలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

సందడిగా స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: స్థానిక భాష్యం పాఠశాలలో స్నాతకోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో యూకేజీ నుంచి 5వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన స్నాతకోత్సవంలో నవ్య గ్రీన్ ఆస్పత్రి అధినేత డాక్టర్ నవ్య,ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ మల్లికార్జునరావు పాల్గొని విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల సీఈవో సత్యం,జెడ్ ఈవో వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

20 కిలోల గంజాయి పట్టివేత

పెందుర్తి: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న యువకుడిని పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ..జి.మాడుగుల నుంచి నగరానికి బైక్‌పై గంజాయి తరలిస్తున్న జగంధర్ గొవిడ బుధవారం పినగాడి పరిసర ప్రాంతంలో అనుమానాస్పందంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. బ్యాగులో 20 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి జగంధర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు. బైక్ సీజ్ చేశారు.

'పది'లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

సబ్బవరం: ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరంలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి బీఎస్ఎన్ మూర్తి సూచించారు. మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు ఉన్న సందేహాలను తీర్చాలని ఆదేశించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు గాను ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పదోతరగతి పరీక్షలకు ఎక్కువ మంది హాజరవుతున్నారన్నారు. 96 మందికి గాను 56 మంది బాలురు,40 మంది బాలికలు ఉన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి పదోతరగతి పరీక్షలకు 530 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు తెలిపారు.

సమాజాన్ని నడిపించేది సాహిత్యం



మాట్లాడుతున్న సూర్యప్రకాశరావు

సీతంపేట: సమాజాన్ని సరైన మార్గంలో నడిపించేది సాహిత్యమని నవసాహితి ఇంటర్నేషనల్(చెన్నై) అధ్యక్షుడు ఎస్.వి.సూర్యప్రకాశరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళ నంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సాహిత్యం ప్రతి ఒక్కరికీ అవసరమని, అది హృదయానికి సంబంధించినదన్నారు. మానవ సంబంధాలు, అనుబంధాలకు సాహిత్యం వారధి అని పేర్కొన్నారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడు తూ మారుతున్న సమాజంలో సాహిత్యం ముఖ్య భూమిక పోషిస్తూ జనుల్లో విలువలను, ఆత్మీయతను పెంపొందిస్తుందన్నారు. డాక్టర్ కె.జి.వేణు బంగ్లాదేశ్ కవి రచయిత ఖాజీ నజ్రుల్ ఇస్లాం సాహిత్యం, జీవిత విశేషాలను వివరించారు.

పల్లె వికాసం

ఇది కదా అభివృద్ధి

భర్నికం గ్రామ పంచాయతీ జనాభా: 2200	పూర్తి చేసిన అభివృద్ధి పనుల విలువ: రూ.65.83 లక్షలు
శివారు గ్రామాలు: బాపడుపాలెం, కట్టవానిపాలెం	కొనసాగుతున్న అభివృద్ధి పనుల విలువ: రూ. 69.44 లక్షలు
మంజూరు చేసిన అభివృద్ధి పనులు 10	సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాల్లోకి: రూ.11.91 కోట్లు

చేసిన పని	ఖర్చు చేసిన నిధులు
గ్రామ సచివాలయ భవనం	రూ.25 లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ.23.94
సీసీ రోడ్లు(2)	రూ.10 లక్షలు
ఎంపీపీ స్కూల్ అభివృద్ధికి	రూ.18.33
అంగన్‌వాడీ కేంద్రం	రూ. 5 లక్షలు
కట్టవానిపాలెం సీసీ కాలువ	రూ.7.50లక్షలు
జల్‌జీవన్‌మిషన్(భర్నికం)	రూ.21 లక్షలు
జల్‌జీవన్‌మిషన్ (బాపడుపాలెం)	రూ.17లక్షలు
జల్‌జీవన్‌మిషన్ (కట్టవానిపాలెం)	రూ.7.50 లక్షలు

పరవాడ: భర్నికం గ్రామ పంచాయతీలో బాపడుపాలెం, కట్టవానిపాలెం శివారు గ్రామాలు ఉన్నాయి. ఈ పంచాయతీలో 2200 జనాభా ఉంది. గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదు. దీంతో కనీస వసతులు లేక ప్రజలు అవస్థలు పడేవారు. 2019లో జగనన్న ప్రభుత్వం ఏర్పాటుతో గ్రామం అన్ని విధాల అభివృద్ధి పథంలో దూసుకుపోయింది. గ్రామంలో రూ.25లక్షలతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ భవనం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ సేవలు అందించడానికి సిబ్బందిని నియమించి 105 ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇంటి పక్కనే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు అవస్థలు తప్పాయి. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇళ్ల వద్దకే పెన్షన్ సొమ్ము వలంటీర్లు తెచ్చి అందిస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ప్రభుత్వ నిధులతో సిమెంటు రోడ్లు, సీసీ కాలువలు, అదనపు భవనాల నిర్మాణాలను చేపట్టారు. తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొమ్మోజీ వీధిలో పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి కష్టాలు తీర్చారు. మారుమూల గ్రామమైన కట్టవానిపాలెంలో రైతు భరోసా కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం కంకణం కట్టింది. త్వరలో నిర్మాణం పూర్తి చేసుకుంటున్న ఆర్‌బీకేతో రైతులకు ఎరువులు, విత్తనాలు కోసం పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయి. భర్నికం, కట్టవానిపాలెం, బాపడుపాలెం గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు చకచకా పూర్తి చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామం ముఖ చిత్రం పూర్తిగా మారిపోయింది. గ్రామ ప్రజలకు అందుతున్న సంక్షేమం, అభివృద్ధి పథకాల అమలుతో ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం



కట్టవానిపాలెంలో నిర్మించిన సీసీ కాలువ



నాడు-నేడులో అభివృద్ధి చేసిన అంగన్‌వాడీ భవనం



భర్నికంలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు

కాలువ నిర్మాణంతో వెతలు తప్పాయి



నేను కట్టవానిపాలెం గ్రామంలో నివాసం ఉంటున్నాను. గతంలో గ్రామంలో ప్రధాన కాలువ లేక గ్రామస్తులు వినియోగించిన వృథా నీరు వీధుల్లో నిలిచిపోయేది. ఫలితంగా భరించలేని దుర్వాసనతో దోమలు విజృంభించి నానా ఇబ్బందులు పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామంలో ప్రధాన కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సీసీ డ్రైను నిర్మించారు. వాడుక నీరు ఎప్పటికప్పుడు చెరువులోకి కాలువ ద్వారా వెళ్లిపోతుంది. జగనన్నకు రుణపడి ఉంటాం.

– కె.గౌరమ్మ, కట్టవానిపాలెం

సీసీ రోడ్లతో కష్టాలకు చెక్



మా వీధిలో మెటల్ రోడ్లు ఉండేవి. రాళ్లు తేరిన రోడ్లపై రాకపోకలు సాగించడానికి అవస్థలు పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం రాకతో మా వీధిలో సీసీ రోడ్డు వేశారు. మా కష్టాలు తొలగిపోయాయి. గుంతలతో నిండిన భర్నికం-పరవాడ రహదారిని కూడా అభివృద్ధి చేశారు. మా కష్టాలు తీర్చిన జగనన్నకు అండగా ఉంటాం.

– మొల్లేటి పార్వతి, భర్నికం

అన్ని విధాల అభివృద్ధి



జగనన్న ప్రభుత్వంలో గ్రామం అన్ని విధాల అభివృద్ధి సాధించింది. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. మారుమూలనున్న కట్టవానిపాలెంలో ఆర్‌బీకే నిర్మించి ప్రభుత్వ సేవలు రైతుల ముంగిటకు తెచ్చింది. అసంపూర్తిగా నిలిచిపోయిన దుర్గమాంబ ఆలయాన్ని సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి చేశాం. కమ్యూనిటీ భవనం నిర్మించాం. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సహకారంతో పరవాడ-భర్నికం బీటీ రోడ్డు అభివృద్ధి చేశాం. దీంతో ప్రజలు సంతోషంగా ఉన్నారు.

– పెదిశెట్టి పూజాశేఖర్, సర్పంచ్, భర్నికం

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

- రిటర్నింగ్ అధికారి శేషశైలజ
- సబ్బవరంలో పలు పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఆదిరెడ్డిపాలెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేష శైలజ

సబ్బవరం: త్వరలో రానున్న సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని పెందుర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేష శైలజ తెలిపారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆమె బుధవారం పరిశీలించారు. కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 68 పోలింగ్ కేంద్రాలకు గాను ఇప్పటికే 48 కేంద్రాలను పరిశీలించామన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద నేమ్ బోర్డులు,వాష్ రూమ్స్,విద్యుత్ సదుపాయం,ర్యాంపులు ఏర్పాటు ,తాగునీరు సౌకర్యం వంటి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో 2,87,484 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,43,246 మంది పురుషులు,1,44,235 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. సబ్బవరం మండలంలో 58,244 మంది ఓటర్లు ఉండగా వీరిలో 28,645 మంది పురుషులు, 29,540 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు.

పెందుర్తి మండలంలో 1,55,567 మంది ఓటర్లకు గాను పురుషులు 77,847 మంది,మహిళా ఓటర్లు 77,717 మంది ఉన్నారన్నారు.

పరవాడ మండలంలో 62,607 మంది ఓటర్లకు గాను పురుషులు 31,101 మంది, మహిళా ఓటర్లు 31,506 మంది ఉన్నారన్నారు. పెదగంట్యాడలో 11,066 మంది ఓటర్లకు గాను పురుషులు 5,644 మంది,మహిళా ఓటర్లు 5,422 మంది ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ చలమయ్య,డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ వీఆర్వో శేషు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు

- దివ్యాంగులు, ఓటర్లకు మౌలిక వసతులు కల్పించండి
- అధికారులతో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్, పాల్గొన్న అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

మహారాణిపేట: సాధారణ ఎన్నికలకు ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఏఈఆర్వోలు, వివిధ శాఖల అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని బీఎల్వోలతో కలిసి తనిఖీ చేయాలని ఆదేశించారు. కేంద్రం వద్ద దివ్యాంగులకు ర్యాంపులు, ఓటర్లకు టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ బూత్ బయట ఆ కేంద్రం వివరాలు తప్పక నమోదు చేయాలని చెప్పారు. 10 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న ఇళ్లను పరిశీలించాలన్నారు. జనవరి 5 తరువాత అందిన ప్రతి ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, చేరికలు, తొలగింపులు జాగ్రత్తగా చేపట్టాలన్నారు.

సమస్యలుంటే తెలపండి..

ఓటరు జాబితాలు, పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే తక్షణం తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జేసీ మయూర్ అశోక్ కోరారు. కలెక్టరేట్‌లో తూర్పు నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. తూర్పు పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అన్ని కేంద్రాల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏఈఆర్వోలు, అధికారులు, సూపర్‌వైజర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



రవికుమార్ మృతదేహం

పరవాడ: లంకెలపాలెం-సబ్బవరం రహదారిలో మంత్రిపాలెం కూడలి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని కాకినాడకు చెందిన ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటనపై స్థానికులు, పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కాకినాడ రూరల్(నియర్ కరెంట్ ఆఫీస్)కు చెందిన టి.రవికుమార్(47) అనే లారీ డ్రైవర్ బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మంత్రిపాలెం కూడలిలో రోడ్డు పక్కన తన లారీని నిలిపి సొంత పనిపై రహదారి దాటుతున్నాడు. ఇంతలో వెనుక నుంచి వచ్చిన మరో వాహనం అతడిని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవికుమార్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. స్థానికులు అందించిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పరవాడ పోలీసులు మృతుడి వద్దనున్న ఆధారాల సాయంతో కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించామన్నారు.

భవన నిర్మాణాలపై 1 శాతం సెస్ చెల్లించాలి

సీతంపేట: జిల్లాలోని అన్ని కన్‌స్ట్రక్షన్ యూనిట్లు, భవనాల నిర్మాణానికి వెచ్చించే వ్యయంలో 1 శాతం సెస్ రూపంలో ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని భవన, ఇతర నిర్మాణాలు చేపట్టే యజమానులు తమ నిర్మాణాలను ఎస్టాబ్లిష్‌మెంట్ రూపంలో సమీప మీ సేవా, లేదా వార్డు సచివాలయంలో గాని, మీ సేవా పోర్టల్‌లో గాని నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఎస్టాబ్లిష్‌మెంట్స్ ఫారం సీ రూపంలో రిటర్న్ కార్మిక శాఖ సంబంధిత అధికారికి అందజేయాలన్నారు. జిల్లాలో భవన నిర్మాణ యజమానులు, కాంట్రాక్టర్లు, భవన నిర్మాణ కార్మిక చట్టం 1996 ప్రకారం భద్రతా చర్యలు తీసుకోవాలని, కార్మికులకు హెల్మెట్లు, రక్షణ గ్లౌజ్‌లు, ఎత్తులో పనిచేసే వారు కింద పడిపోకుండా కాపాడే యంత్ర సదుపాయం కల్పించాలని చెప్పారు. దుకాణ, వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు తమ సంస్థలను ఈ నెల 29లోగా సమీప మీ సేవా కేంద్రంలో గాని, వార్డు సచివాలయంలో గాని రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ పూర్తి చేయాలని తెలిపారు.

అత్తింటి ఎదుట కోడలి నిరసన

కూర్మన్నపాలెం: భర్త విడాకులు కావాలంటూ లాయర్ నోటీసు పంపడంపై ఆగ్రహించిన ఓ యువతి అత్తింటి ఎదుట నిరసనకు దిగింది. ఈ సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలు చట్టి రమ్య తెలిపిన వివరాలివి.. పెదగంట్యాడకు చెందిన చట్టి రమ్యకు అగనంపూడి ప్రాంతానికి చెందిన ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుడు చట్టి వెంకటఅప్పారావుతో 2021లో వివాహం జరిగింది. వివాహ సమయంలో సుమారు 5 లక్షల రూపాయల నగదు, ద్విచక్రవాహనం, సుమారు రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, 3 లక్షల రూపాయలు విలువ చేసే సారె సామగ్రి ఇచ్చారు. పెళ్లయిన మూడు నెలలు కాపురం బాగానే సాగినా.. అనంతరం అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు ఎక్కువయ్యాయి. ఈ వేధింపులు తట్టుకోలేక అనారోగ్యానికి గురై, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రమ్యకు ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన అనంతరం ఆమె కన్నవారింటికి దేవాడ వెళ్లిపోయింది. ఫిబ్రవరి 3వ తేదీన భర్త వెంకట అప్పారావు నుంచి తనకు విడాకుల నోటీసులు వచ్చాయి. బుధవారం ఆమె గ్రామ పెద్దలను తీసుకొని అత్తింటికి వెళ్లగా వారు లోపలకు రానివ్వలేదు. దీంతో ఆమె అత్తింటి ఎదుట నిరసనకు దిగింది. తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని, తనపై అభాండాలు వేస్తే సహించేదిలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. సమాచారం తెలుసుకున్న దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రమ్యను, అత్తింటి వారిని పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిందిగా సూచించారు. స్టేషన్‌లో రమ్య ఫిర్యాదు మేరకు ఇరువురిని కౌన్సెలింగ్ నిమిత్తం దిశ పోలీస్‌స్టేషన్‌కు పంపుతున్నట్లు దువ్వాడ పోలీసులు తెలిపారు.

పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ

వైస్ ఎంపీపీ అప్పలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలరాజు

పరవాడ: తమ పిల్లల చదువుతో పాటు నడవడికపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మండల వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు అన్నారు. వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో బుధవారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల చదువు, వ్యక్తిగత జీవితంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు సూచన చేశారు. అంతకుముందు పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. స్టడీ అవర్స్ సద్వినియోగం చేసుకుని శత శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, సర్పంచ్ శివలంక లక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం ఎస్.కనకేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ కె.ఉమా, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వీరాంజనేయ తీర్థం



చియాతపాలెంలో స్వామిని దర్శించుకుంటున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు చినయాతపాలెంలో శ్రీవీరాంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని తమలపాకులు,సింధూరంతో ప్రత్యేక పూజలు,పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో డి. కళ్యాణి, రెండో స్థానంలో ఎం. ప్రశాంతి, మూడో స్థానంలో పరినవి,నాలుగో స్థానంలో బి. పూర్ణిమ, ఐదో స్థానంలో బి. తులసీ నిలిచారు. వీరికి ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం స్వామివారి సన్నిధిలో నిర్వహించిన కోలాటం పోటీలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామిని దర్శించుకున్నవారిలో ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం దుర్గినాయుడు, తుంపాల సుగర్స్ మాజీ డైరెక్టర్ మళ్ల కోటేశ్వరరావు,ఉత్సవ కమిటీ సభ్యులు మళ్ల బాలాజీ,గంగునాయుడు,నాగభూషనం,దొడ్డి అప్పలనాయుడు,శరగడం సత్యనారాయణ,బొడ్డేటి కాశీ సూరి అప్పారావు తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సమష్టి పోరాటం



సెమినార్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వివిధపార్టీలు, కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: సమష్టి పోరాటాలతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుందామని వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన సెమినార్‌లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, సీపీఐ జాతీయ కార్యదర్శి ఎ.రాజా, విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, ఏఐటీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి అమరజీత్ కౌర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మేధావుల ఫోరం కన్వీనర్ చలసాని శ్రీనివాస్, జై భారత్ పార్టీ అధ్యక్షుడు జె.డి.లక్ష్మీనారాయణ పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మూడేళ్లుగా కార్మిక వర్గం ఆందోళన చేస్తోందని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ఆందోళనలు చేయడం ద్వారా ప్లాంట్‌ను కాపాడుకుందామని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, సీహెచ్. నర్సింగరావు, కె.ఎస్.ఎన్.రావు, జె.అయోధ్యరామ్, వై.మస్తానప్ప, జి.గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ స్ఫూర్తితో ఉద్యమం ఉధృతం



దీక్ష శిబిరంలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: ప్రజా గాయకుడు గద్దర్ స్ఫూర్తితో ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. గద్దర్ ప్రధానంగా పాలకుల వైఫల్యాలను, తద్వారా ప్రజలపై పెరుగుతున్న భారాలకు వ్యతిరేకంగా తన గళాన్ని విప్పి ప్రజాచైతన్యం కలిగించారని, అదే రీతిలో పోరాడదామన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1091వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎస్.ఎం.ఎస్–1 విభాగ కార్మికులు, ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తిపరంగా ఆటంకాలను సృష్టిస్తూ.. కార్మిక శక్తిని అణగదొక్కే విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలన్నారు. కార్మికుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.